# నాన్న

రాత్రి ఎనిమిదిన్నరయింది. విశ్వనాథం టెరస్‌మీద కూచుని సిగార్ కాలుస్తూ నక్షత్రాల్ని, ఆకాశాన్ని చూస్తూ, ఏవేవో ఆలోచించుకుంటున్నాడు. చుట్టూ నిశ్శబ్దం, నిర్మానుష్యం. పండువెన్నెల్లో ఎలక్ట్రిక్ లైట్లు వెలాతెలా పోతున్నాయి. వెనకాతల అడుగుల చప్పుడికి వులిక్కిపడి తిరిగిచూశాడు. రంగారావు ఏదో ఆదుర్దాగా చూస్తూ వస్తున్నాడు.

"ఏం ఇలావచ్చావు? సినిమాకెళ్ళామని అనుకుంటేరిగా రఘు ఏడి?" అని ప్రశ్నలవర్షం కురిపించాడు విశ్వం.

"సినిమాలేదు-ఏమీలేదు. రఘు నాగపూర్ వెళ్ళనంటున్నాడు" అని నిర్జీవంగా కూలబడ్డాడు రంగారావు.

విశ్వం తెల్లపోయాడు. మర్నాటి పొద్దుటే ఎక్స్‌ప్రెస్‌కి రఘుని పంపేందుకు స్టేషనుకు వెళ్దామని అనుకుంటూంటే-రఘు వెళ్ళనంట మేమిటి? తనకు తెలిసినవాళ్ళల్లో రఘువొక్కడే సెలక్టయాడని మురిసిపోతే డ్యూటీలో చేరనంటం ఏమిటి? అందులో గవర్నమెంటు వుద్యోగం ఐ. ఎ. యస్. కి వెళ్ళి సెలక్టవటం సామాన్యంకాదే, అన్నీఅయి రఘుయిలా చెయ్యడమేమిటి?

"అసలు ఏం జరిగింది?" అని ప్రశ్నించాడు విశ్వనాథం.

"పొద్దుట నీదగ్గర కొచ్చినప్పుడుగూడా చాలా వుత్సాహంగా వున్నాడు. నీదగ్గరనుంచి ఇద్దరం వెళ్ళి బజార్లో సామాన్లు ఏవో కొన్నాం. అక్కడినుంచి వాడు స్నేహితులింటికెళ్ళి వస్తానని వెళ్ళిపోయాడు. నేనింటికొచ్చి, వాడి ప్రయాణానికి సన్నాహం చేస్తున్నాను, భోజనానికి రాలేదు. నాలిగింటికి ఇంటికొచ్చాడు. కళ్ళన్నీ ఎర్రగా వున్నాయి. గదిలోకివెళ్ళి

తలుపులు మూసుకు పడుకున్నాడు. అయిదున్నరకి బయటికొచ్చి నేను వుద్యోగానికి వెళ్ళను. ప్రయాణం లేదనిచెప్పి మళ్ళీ వెళ్ళి పడుకున్నాడు. "బెర్తుగూడా రిజర్వ్ చేయించాను. రేపు డ్యూటీలో చేరకపోతే ఎలా ? అందులోగవర్నమెంట్ జాబ్" అని కుడిచేత్తో తలపట్టుకున్నాడురంగారావు.

విశ్వనాథానికి రంగారావుని చూస్తే జాలేసింది పాపం ! అతనికెందుకీ బాదర బందీ ? జడభరతుడిలా ఏనాటి బాంధవ్యం ? ఎందుకీ మమకారాలు? హాయిగా ఒంటిగా కాలక్షేపం చెయ్యక !

"ఎందుకని కారణం అడగలేదా నువ్వు ?"

"లేదు. నీకుతెలుసుగా వాడిని నిలవదీసి నేనుప్రశ్నలు వెయ్యనని."

"అయితే ఏం చేద్దాం ?"

"అందుకే నీదగ్గరకొచ్చాను. నాకేం పాలుపోవటంలేదు. వాడు వుద్యోగంలో జాయినవుతే నాభారం పూర్తిగా వొదుల్తుందని అనుకున్నాను. జానకికి నేనిచ్చినమాట నిలబెట్టుకున్న వాడినవుతాను-అని అనుకుంటుంటే రఘు ఇలాచేస్తే నేనేం చెయ్యను ?" అన్నాడు ఎడంచేతిమీద పడ్డ కండు వాని బుజంమీదకు లాక్కుంటూ. ఎడంచెయ్యి తొంటి, ఎడంచెయ్యి విశ్వం వంక దైన్యంగా నిస్సహాయంగా చూచింది.

"కారణం చూచాయగా తెలుసా నీకు ?" అని తిరుగా ప్రశ్నించాడు విశ్వం.

"మూడ్రొంతులు-డాక్టర్ చదువుతోంది నిర్మలలేదూ - ఆ అమ్మాయి కారంణం అనుకుంటా. వాడిని సాయంత్రం చూస్తే, మనం చదువుకునే రోజుల్లో ఆనాటి ప్రొద్దుట నీకు నేను కనపడ్డానే, ఆవన్నీ జ్ఞాపకం వచ్చాయి. అదేకారణం అయివుంటుంది."

"ఏం చేద్దామంటావు ?"

"రఘుకి నీమీద చాలాగురివుంది. వాడిని నువ్వు తొందరగా నమ్మించ గలవు. నువ్వు నెమ్మదిగా మంచిమార్గంలోకి లాక్కురా. వాడు డ్యూటీలో జాయినయేట్టు చూడటం మనకర్తవ్యం. ప్రేమ-గీమా తర్వాత.సిద్ధాన్నంకాల దన్నకూడదు" అని ఆగిపోయాడు రంగారావు.

విశ్వం మాటాడక సిగరెట్ కాలుస్తున్నాడు. జానకి వెళ్ళిపోయింది. యీ రెండోచెయ్యి మిగిలింది-రఘు మిగిలాడు అతనుగూడా రంగారావుని నిరాశల్లోకి లాగబోతున్నాడు. ఎందుకీ మనిషిని ప్రజలిలా బాధిస్తారు?

"కింద నా గదిలో పడుకో. రఘుతో నేను మాటాడి వస్తాను" అంటూ లేచాడు విశ్వం.

రంగారావు ఆశా నిరాశలమధ్య వూగులాడుతూ అలాగే కూర్చుండి పోయాడు.

*　　　*　　　*　　　*

విశ్వం రంగారావు ఇంటికి చేరేవేళకి యింట్లో దీపంలేదు. తలుపు కొట్టిన పదినిమిషాలకి రఘు తలుపు తెరిచాడు. అతనిముఖం చూస్తే విశ్వానికి విచారంవేసింది. ఉడుకురక్తం చిక్కి[illegible]తో రఘు పదేళ్ళపెద్దవాడిలా అయిపోయాడు. వయస్సువల్ల కలిగేబా[illegible] ఎంత లేనివాళ్ళకు తప్పవు.

"నాన్న ఏడీ?" అన్నాడు తెలీనట్లు విశ్వం.

"బయటకెళ్ళారనుకుంటా"

విశ్వం కిటికీ దగ్గరగా కుర్చీ లాక్కొని కూచున్నాడు. రఘుమాట్లాడ లేదు. అతనికళ్ళు లోకంలోని నిరాశలకు, దుఃఖాలకు ప్రతినిధుల్లా కనబడుతున్నాయి విశ్వానికి.

"లైటు ఆర్పేస్తున్నాను-వెన్నెల బాగుంది" అంటూ సమాధానికి ఎదురు చూడకుండా లైటు ఆర్పి కూచున్నాడు విశ్వం.

చల్లని వెన్నెల రఘు నుదుటిమీద, చెల్లా చెదురయిన జుట్టుమీద పడుతోంది. ఆ క్షణాన రఘు తిరిగి అయిదేళ్ళ పిల్లవాడిలా కనపడ్డాడు. విశ్వానికి.

"రఘు నా కెన్నేళ్ళో తెలుసా?"

"నలభైఅయిదుకీ-యాభైకి మధ్య అన్నగారూ" అన్నాడు నిర్జీవంగా రఘు.

"నీకో కథ చెబుదామని వచ్చాను. అది నువ్వు వినాల్సిన కథ."

"ఇది పాతికేళ్ళ క్రిందటిమాట. అప్పటికి నేను ఇంటర్ చదువుతూ వుండేవాణ్ణి. నాతోపాటు మీవూరి కుర్రవాడొకడు కాకినాడ కాలేజీలో

చదువుతూ వుండేవాడు; అతను థరడియర్. ఇద్దరం కలసి వుంటూండేవాళ్లం. కుక్కర్ మీద వండుకుతిని, కాలేజీకి వెళ్తూవుండేవాళ్ళం. ఇద్దరికీ ఒకే క్లాసు కాకపోయినా, ఒకేవూరువాళ్లం కాబట్టి, చాలా స్నేహంగా వుండే వాళ్ళం. మేమున్న ఇంటికి మూడో ఇంటివారబ్బాయి సత్యం. నా క్లాసులో చదువుతూఉండేవాడు. అతను నా కోసం రావడంలో క్రమంగా నా స్నేహి డితోగూడా పరిచయం అయింది. సత్యానికీ మాకూ మధ్య రాకపోకలు విరివిగా జరుగుతూండేవి. సత్యానికి అయిదుగురు చెల్లెళ్ళు, అమ్మా నాన్నా వుండేవారు. అతనేపెద్ద. ఒక్కడే కొడుకున్నూ. అతని పెద్ద చెల్లెలు జానకి ఫిఫ్త్‌ఫారమ్ చదువుతూండేది.

"నా స్నేహితుడి ఎడంచేతికి ఆరువేళ్ళుండేవి. మేమంతా వేళా కోళం చేసేవారం. కాని అట్టే పట్టించుకునేవాడు కాదు.

"మాతండ్రి ఆబ్దీకానికి మావూరు వెళ్ళాను. వెళ్లేటప్పుడు నా ఫ్రెండూ, సత్యమూ స్టేషనుకొచ్చి రైలెక్కించారు. తద్దినమయిన మూడో నాడు తిరిగి వచ్చేశాను.

"గదికొచ్చేవేళకి పుట్టెడు జ్వరంతో నా స్నేహితుడు పడివున్నాడు. ఒంటిమీద స్పృహలేదు. ఎడంచెయ్యి వాచి ఎర్రంగా అయింది, కట్టు కట్టి వుంది. అతను మట్టుకు ఏవేవో పేలుతున్నాడు జ్వరంలో. వెంటనే డాక్టరుని కేకేసుకుని వచ్చాను. అతను వచ్చి చూశాడు, ఎడంచేతి ఆరోవేలు కత్తితో కోసుకోడంవల్ల సెప్టిక్ అయింది. దానితో జ్వరం.

"హాస్పటల్లో జేర్చి, తల్లికి, తండ్రికీ వైరిచ్చాను. వాళ్ళు ఏడుచు కుంటూ, లబలబలాడుతూ వచ్చారు. ఒక్కగాని ఒక్క కొడుకో-అని వాళ్లు ఒకటే ఏడుపు

"సెప్టిక్ అవడంవల్ల ఎడంచెయ్యి మణికట్టుదాకా కట్ చెయ్యాలి సొచ్చింది. మృత్యువుతో పోరాడి రెండు నెలలకి పక్కమీంచి లేచాడు.

"ఇదంతా నాన్నగురించా?" అన్నాడు రఘు ఖంగారుగా. విశ్వం వినిపించుకోనట్టు చెప్పుకుపోయాడు.

"అతన్ని మాటవరసకి రావు అందాం. రావు హాస్పటల్లో వుండగా సత్యం వస్తూ పోతూండేవాడు. ఒకనాడు మాటల్లో జానకి సంబంధం కుదిరిం దని, వచ్చేవారం పెండ్లనీ, అప్పటికన్నా మా స్నేహితుడు లేవగలిగితే

బాగుంటుందనీ అన్నాడు. ఈమాటలు వింటున్న రావుముఖం తెలతెలపోవటం కనిపెట్టాను. సత్యం వెళ్ళాక నిలవదీసి అడుగుతే చెప్పాడు, తనకి ఆరువేళ్ళు వున్నాయని జానకి నవ్విందట. ఆరు వేళ్ళవాడిని పెళ్ళాడనని హేళన చేసిందట. అందువల్లనే వేలు కత్తిరించుకున్నాట్ట. ఆరాత్రి ఈ ఖబురుతో మళ్ళీ జ్వరం వచ్చింది. ఈవేలు ఎందుకు తీసుకున్నదీ మరో ప్రాణికి తెలియరాదని మాట పుచ్చుకున్నాడు. అసలు అతను ఆవేలు ఎందుకు కత్తిరించుకుందీ ప్రపంచానికి యీనాటివరకూ తెలియదు.

"ఆరోగ్యం కోలుకునేందుకు ఆ ఏడు చదువు మానెయ్యవలసి వచ్చింది. తల్లీ తండ్రితో కలసి యింటికెళ్ళిపోయాడూ రావు.

"మరుసటి ఏడు మళ్లీ కాలేజీలో ప్రవేశించాము. ఇద్దరం పూర్వం మాదిరిగానే కలసి వుండేవాళ్ళం సత్యంగూడా స్నేహంగా వుంటూ వుండేవాడు. రావు చేతి రహస్యం నాకూ జానకికీ తప్ప మరో ప్రాణికి తెలీదు.

"జానకిని రెండో పెళ్ళియన కిచ్చారనీ, చాలా కష్టపడుతున్నారనీ సత్యం మాతో ఒకసారి అన్నాడు. నేను తలవూపి వూరుకున్నాను. రావు అక్కడనుంచి వెళ్ళిపోయాడు. మేము మళ్ళీ జానకిని చూడలేదు. రావు బి. ఏ. ముగించి ఎం. ఏ. చదివేందుకు మద్రాసు వెళ్ళాడు.

"ఈలోపల ఎన్ని సంబంధాలు వచ్చినా అక్కర్లేదని భీష్మించుకు కూర్చున్నాడు. పెళ్ళి చేసుకోలేదని తల్లీ తండ్రీ దుఃఖించేవారు.

"రావు ఎం. ఏ. చదువుతుండగా తల్లీ తండ్రీ పోయారు. ముసలాళ్ళిద్దరూ వుండగా పెళ్ళాడనందుకు నలుగురూ నాలుగు మాటలూ అన్నారు. ఘోటక బ్రహ్మచారి-అని హేళనచేసేవారు. "ప్రేమించడం ఒకేసారి. అది విఫలం అయింది. చితికిన యీ హృదయాన్ని మరో పిల్లకి ఇవ్వలేను. అసలు పెండ్లేవద్దు, బ్రహ్మచారిగా వుంటాను" అని ప్రతిజ్ఞ చేసుకున్నాడు రావు.

"బి. ఎ. అయాక నేను బి. యల్.కి మద్రాసు వెళ్ళాను. సత్యం బి. ఎ. నాలుగుసార్లు పల్టీలుకొట్టి కలక్టారాఫీసులో క్లర్కుగా చేరాడు.

"రావుకి ఎం. ఎ లో క్లాసు వచ్చింది. కాకినాడ కాలేజీలో లెక్చరర్‌గా వేశారతన్ని. నేను మద్రాసులో స్థిరపడిపోయాను. ఇద్దరం తరచు వుత్తరాలు రాసుకుంటూండే వాళ్ళం.

"ఒక ఉత్తరంలో జానకి భర్త పోయాడనీ, ఏడాది పసికూనతో జానకి పుట్టింటి కొచ్చిందనీ, సత్యం సంసారం చాలా చితికిపోయిందనీ, సత్యానికి ఆడపా తడపా సాయం జేస్తున్నాననీ రాశాడు నాకు.

"నేనా విషయానికి జవాబు రాయలేదు. అసలు అతను కాకినాడలో వుండటం యిష్టంలేదు నాకు. అందులో జానకీ వాళ్లతో సంబంధం పెట్టుకోడం మరీ యిష్టంలేదు. కాని నాకెందుకని వూరుకున్నాను.

"మరో ఏడాది పోయాక జానకికి టి. బి. అనీ, ఆమె పరిస్థితి చాలా ఘోరంగా వుందనీ, సత్యం వాళ్ళూ మందూ మాకూ యిప్పించడం లేదనీ, తనకి ఏం చెయ్యాలో తోచడం లేదనీ వుత్తరం రాశాడు.

రావు మళ్ళీ ఊబిలోకి దిగుతున్నట్టు నాకూ అనుమానం తోచింది. కాని జానకి అతని హృదయానికి సంబంధించిన సమస్య. నేను సలహా యివ్వడం సమంజసం కాదు, అక్కడికీ మద్రాసు వచ్చెయ్యమనీ, ధృక్పథం విశాలం కాగలదనీ జవాబు రాశాను. కాని రావులో కదలిక రాలేదు.

"మరి కొన్నాళ్లకు-సత్యం పూర్తిగా మారిపోయాడనీ, జానకిపట్ల అతను ఏమాత్రం శ్రద్ధచూపించడం లేదనీ, జానకి జీవితం గాలిలో దీపంలా అయిపోయిందనీ, పసిపిల్లకేమిటో అయోమయంగా వుందనీ రాశాడు, నేను జవాబు రాయలేను.

"ఒకనాడు కోర్టునుంచి వచ్చేవేళకి వైర్ వచ్చి వుంది, రావు దగ్గిర నుంచి స్టేషనుకి రమ్మని. నాకు చాలా సంతోషం వేసింది. అతనింక కాకినాడ వెళ్ళకుండా చేద్దామని జానకినుంచీ, ఆ పరిసరాలనుంచీ తప్పిద్దామనీ ఎన్నో ఆలోచనలతో స్టేషను కెళ్ళాను.

"రైల్లోనుంచి రావు ఎముకలపోగు జానకి నాలుగేళ్ళ కుర్రాడు దిగారు. నిర్ఘాంత పోయాను యింటికొచ్చాము.

"ఆ సాయంత్రం రావు చెప్పాడు. సత్యంతో దెబ్బలాడి జానకినీ పిల్లాడినీ తీసుకొచ్చాడట. వుద్యోగానికి రాజీనామా ఇచ్చాడట. వాళ్ళ నాన్న ఇచ్చిన పొలం అమ్మితే ఆరువేలు వచ్చిందట. దీంతో జానకిని మదనపల్లి తీసుకెళ్ళి మందిప్పిస్తానన్నాడు. ఇంకా కాకినాడకీ తనకీ సంబంధం లేదన్నాడు "ఎముకలపోగు ఆ జానకికోసం ఎందుకో ఆ శ్రమ! నాకు

అర్థం కాలేదు. మంచమెక్కిన జానకికోసం అతనిబాధ అవగాహన కాలేదు నాకు.

"ఏమయినా జానకిమీద అతనికున్న ప్రేమనిమటుకు గౌరవించకుండా వుండలేకపోయాను. అంతకంటె ఔదార్యంతో ప్రేమించగలిగే గొప్పతనం నాలోలేదు. ఎంత లౌకికజ్ఞానం తెలిసినవాడయినా, ఆ నిజం గ్రహించేందుకు నేను భయపడలేదు.

"మదనపల్లి వెళ్ళాక జానకి స్థితి మరీ క్షీణించ నారంభించింది. మందులూ, మాకులూ, ప్రేమా, సేవా ఏవీ ఆవిడని మృత్యుముఖంనుంచి రక్షించలేకపోయాయి.

"లోకంలో అంతా రావు స్త్రీలోలుడనీ, వెధవని లేవదీసుకొచ్చి ఆమె చావుకు కారకుడయాడని ప్రచారం చేసింది. నాకు తెలుసు అసలు నిజం. జానకి కడుపునిండా తిని, కంటినిండా నిద్రలేని స్థితిలో వుంది. అటువంటి స్త్రీ నుంచి రావు సుఖం ఆశించాడని పశుప్రాయులు అనుకుంటారు"

శివం ఆత్రంగా విశ్వనాథం ముఖంలోకి చూస్తున్నాడు. అతనిలోని అణువణువు విశ్వం నోటినుంచి వచ్చే మాటకై చూస్తోంది. విశ్వనాథం కలలో మాదిరి చెప్పుకుపోతున్నాడు

"ప్రతి వారం వెళ్ళి జానకిని, రావుని చూసి వస్తూండేవాడిని. చంటి పిల్లాడితో కలిసి నేనూ రావూ ఆడుకుంటూండేవారం. జానకి కోలుకునేందుకు యిద్దరం శాయశక్తులా తంటాలు పడేవాళ్ళం, జానకి దురదృష్టవంతురాలు. మరో పురుషుణ్ణి పెండ్లాడిన మర్నాడే ఆవిడ తన మనోబలం కోల్పోయింది. రావు ఇచ్చిన మనోబలాన్ని అందుకోలేక పోయింది. నిజంగా జానకి బతికివుంటే రావు ఆవిడని ఎంత సుఖపెట్టేవాడో అని ఆశ్చర్యపడుతుంటాను

"ఆనాడు శనివారం. రైలుదిగి వెళ్ళాను. జానకి స్థితి మరీ అధ్వాన్నంగా వుంది. మృత్యువు రోజుల్లో ఉందని నాకూ రావుకీ తెలుసు. ఆ పది నెలల్లో జానకి అంటే నాకు ఒక విధమైన వాత్సల్యం ఏర్పడింది. ఆవిడిని బతికించాలనే పట్టుదల హెచ్చింది. కాని మా ఆశలు నిరాశలయాయి.

"ఆదివారం ప్రత్యూషకాలం. జానకి రాత్రిల్లా మరణవేదన పడి, తెలికాకి అరుస్తుంటే, మాయిద్దరి చేతుల్లో, నిన్నువుంచి, నిన్ను ప్రయోజకుడిగా చేసే భారం రావుమీద వుంచి, మాట తీసుకుని, కళ్ళుమూసింది."

"అయితే, నేను నాన్నకి సొంతకొడుకుని కానా?" అని ఆశ్చర్యంగా లేచాడు కుర్చీమీంచి రఘు.

విశ్వనాథం సమాధానం చెప్పకుండా కథ కానిచ్చాడు.

"లోకం అంతా-ఆఖరికి సత్యంకూడా చెల్లెలిమీద కక్షవల్ల - తన కళ్ళతో నీ పుటకలు చూసినా- నువ్వు పతిత అయినా జానకికీ, రంగారావుకే పుట్టావని ప్రచారం చేశాడు. జానకి మరణానంతరం నీ పెంపూ, బాధ్యతా తనమీద పడుతుందని యీ అపవాదు పుట్టించాడు. అదీగాక, సత్యానికి జానకికై రంగారావు చేసినఖర్చు, స్నేహితుడైన తనకు బెట్టక, తన చెల్లెలుకోసం పెట్టడ మేమిటని కసిగావుండేది. ఈఅపవాదు ఒకందుకుమంచిదే అయింది. జానకి చావు తొందరగా రావుకి-ప్రపంచానికీ, తనకీ మధ్య నువ్వొక్కడివే కనపడ్డావు. ఆ స్థితిలో నువ్వుగూడా లేకపోతే అతనికి జీవితంలో యీపాటి ఆలంబనంకూడా వుండేదికాదు.

"ఆ తరువాత వొక ఏడాదికి కొత్త కోలుకొని యిక్కడ కాలేజీలో లెక్చరుగా జేరాడు. అప్పటినుంచీ మేమిద్దరం ప్లానువేసి, ప్రతిమెట్టు ఆలోచించి, నిన్ను ఎక్కిస్తున్నాము. నువ్వు శిఖరానికి ఎక్కావు. అతని ఆశలు ఫలించాయి——"

రఘు లేచి కిటికీదగ్గిర నుల్చున్నాడు.

ఈనాటి యువకులు-"ప్రేమ ఏమిటి-ప్రణయం ఏమిటి?" అని హేళన జేస్తారు. జానకి రంగారావుని తిరస్కరిస్తే ఆమె కోసం బాధపడాలా? రెండుబుడ్లు తాగి, భోగం బజారు చుట్టేస్తే చాలదూ? అంటారు. కాని, అది ఒకజాతి మనుషులకే చెందుతుంది. నాలాంటివాళ్ళు అలాగే జేస్తారు. కాని రంగారావులాంటివారు జీవితాన్ని గొప్ప ఆశయాల్లో మొదలెడ్తారు. వాటినుంచి జంకి పారిపోరు, వాటిని ఆరాధిస్తారు. నేనూ ప్రేమించి విఫలత పొందాను, స్త్రీలవల్ల కష్టసుఖాలుఅనుభవించాను. ఇల్లూ, భార్యా పిల్లలూ వున్నారు. రంగారావు నా అంత తేలిగ్గా జీవితాన్ని

తీసుకోలేదు. అతని ఉన్నత భావాలముందు నేనెప్పుడూ తల వొగ్గుతూనే ఉంటాను.

"అతనిలాంటి మనుషులు జానకినేగాదు, ఏ స్త్రీనైనా అంత ఆరాధనతో, సంపూర్ణంగా, నిష్కల్మషంగా ప్రేమించగలరు. అలాంటి ప్రేమను పొందినందుకు జానకి అదృష్టవంతురాలు.

"చనిపోయిన మీ తల్లికంటే, బ్రతికున్న రంగారావుకోసం అయినా, నువ్వు యీ చిన్న చిన్న విషయాల్ని దాటిరావాలి. అతనుపడ్డ పాటంతా నువ్వు స్వల్ప వ్యాకులతలో నిరర్థం చెయ్యకు. మృత్యుముఖంలో అతను పవిత్రభావంతో మీ తల్లికి బాస చేశాడు. దాన్ని ఎన్నో ఆశల్తో నెరవేర్చాడు. సరిగ్గా అది ఫలించబోయే సమయానికి నువ్వు యిలా చేస్తే-అతనెందుకు బతుకుతాడు ?

"యాభైఏళ్ళ అతని జీవితాన్ని వెనక్కి తిరిగి చూసుకుంటే, ఏం సుఖం అనుభవించాడు ? తల్లి తండ్రుల్ని తృప్తిపరచలేకపోయాడు. జానకి ప్రేమని పొందలేకపోయాడు. ఆఖరికి ఆమెని బ్రతికించుకోలేక పోయాడు. చివరికి నిన్ను పట్టుకు వ్రేలాడుతుంటే నువ్వు..."

గడియారం రెండూ కొట్టింది. రఘు లేచి నుంచున్నాడు. అతనికళ్ళు ధగధగ మెరుస్తున్నాయి. రఘుకి జ్ఞానోదయం అయింది.

గుమ్మంలో రంగారావు వొంటిగా, ఒకేఒక్క మానవుడిలా నిల్చున్నాడు. "నాన్నా" అన్న రఘు పిలుపు-విశ్వపితని వుద్దేశించి మానవుడు చేసే ఆక్రందనలా వుంది. మంచు మెట్లూ, కన్నీటి తుంపరలూ, ఆ వెన్నెల్లో ఒకటయాయి.

మర్నాడు ఉదయం రఘు డ్యూటీలో జాయిన్ అయేందుకు ఎక్స్‌ప్రెస్ ఎక్కాడు.